# దివ్యఖుర్ఆన్ అవతరణా లక్ష్యం

## ఒకే నిజదైవాన్ని విశ్వసించడం

మీ దేవుడు ఒక్కడే. ఆ కరుణామయుడు, ఆ కృపాశీలుడు తప్ప మరొక దేవుడు లేడు. (ఖుర్ఆన్ 2 : 163)

దివ్యఖుర్ఆన్‌లో ప్రస్తావించిన అతి ముఖ్యమైన అంశం ఒకే దేవుడిని విశ్వసించాలన్నది. దేవుడికి భాగస్వాములు లేరని, కుమారులు, సమానులు ఎవరూ లేరని, ఎవరికీ పూజలు, ఆరాధనలు అందుకునే అర్హత లేదని దేవుడు స్వయంగా తెలియజేశాడు. దేవుడితో ఎవరినీ, దేన్నీ పోల్చలేము. ఆయన సృష్టిలో ఏదీ ఆయన్ను పోలి లేదు. మానవ గుణగణాలు, మానవబలహీనతలు, లోపాలను దేవునికి ఆపాదించడాన్ని కూడా దివ్యఖుర్ఆన్ ఖండిస్తుంది.

## అసత్యదేవుళ్ళను తిరస్కరించడం

“అల్లాహ్‌నే అరాధించండి. ఆయనకు భాగస్వాములను కల్పించకండి”
(ఖుర్ఆన్ 4 : 36)

కేవలం దేవుడొక్కడే ఆరాధనలకు అర్హుడు కాబట్టి అసత్య దేవుళ్ళను, దేవతలను తిరస్కరించవలసి ఉంటుంది. దేవుడు తప్ప మరెవ్వరికైనా దైవిక లక్షణాలను ఆపాదించడాన్ని దివ్యఖుర్ఆన్ తీవ్రంగా ఖండిస్తుంది.

## గతజాతులచరిత్ర తెలియజేయడం

దివ్యఖుర్ఆన్‌లో గుణపాఠాలు గరిపే గతజాతులచరిత్ర కథనాలున్నాయి. గత ప్రవక్తలు ఆదమ్, నూహ్, ఇబ్రాహీం, ఏసుక్రీస్తు, మూసా తదితర ప్రవక్తలకథలున్నాయి.

“నిస్సందేహంగా వారి చరిత్రలో అర్థం చేసుకునే వారికి గుణపాఠం ఉంది.”ఖుర్ఆన్ 12 : 111

## తీర్పుదినాన్ని గుర్తు చేయడం

ప్రతి ఒక్కరు మృత్యువును చవిచూడక తప్పదని, ప్రతి ఒక్కరు తమ ఆలోచనలు, ఆచరణలకు జవాబు చెప్పుకోవలసి ఉంటుందని దివ్యఖుర్ఆన్ మనకు గుర్తుచేస్తుంది.

తీర్పుదినాన మేము న్యాయంగా తూచే త్రాసును పెడతాము. ఏ ప్రాణికీ ఆవగింజంత అన్యాయం కూడా జరగదు. దివ్యఖుర్ఆన్ 21 : 47

## సరయిన జీవనపంథాను అవలంబించడానికి

ముఖ్యంగా, మానవజీవిత లక్ష్యం దేవుడిని ఆరాధించడం, దేవుడు చూపించిన ప్రకారం జీవించడం మాత్రమేనని ఖుర్ఆన్ బోధిస్తుంది. ఇస్లామ్‌లో ఆరాధన అన్నది సమగ్రమైన, విస్తారమైన పదం. మనిషి బహిరంగంగా, ఏకాంతంలో అన్నివేళలా దైవప్రసన్నత పొందడానికి చేసే ప్రతి పని, ప్రతి మాట ఈ పరిధిలోకే వస్తుంది. కాబట్టి దేవుడు చెప్పిన పనులు చేయడం ద్వారా దేవుడిని ఆరాధించడమే జరుగుతుంది. ఆ విధంగా జీవితలక్ష్యాన్ని పూర్తిచేస్తుంటాం.

దివ్యఖుర్ఆన్ ప్రకారం ఆరాధనకు భావం క్రింది వాక్యాలద్వారా తెలుస్తుంది.

ప్రార్థన : ఓ విశ్వాసులారా! రుకూ సజ్దాలు చేయండి. మీ ప్రభువును ఆరాధించండి. మేలుతో కూడిన పనులు చేస్తూ ఉండండి - తద్వారా మీరు సాఫల్యం పొందే అవకాశం ఉంది. ఖుర్ఆన్ 22 : 77

దానధర్మాలు : ... దైవ మార్గంలో ఖర్చు పెట్టండి. ఇదే మీ కొరకు మేలైనది. ఎవడైతే ఆత్మ లోభత్వం నుండి రక్షింపబడ్డాడో - అలాంటి వారే సాఫల్యం పొందేవారు. ఖుర్ఆన్ 64 : 16

నిజాయితీ : సత్యాన్ని అసత్యంతో కలిపి తారుమారు చేయకండి ఇంకా మీకు తెలిసి ఉండి కూడా సత్యాన్ని దాచకండి. ఖుర్ఆన్ 2 : 42

లజ్జ : విశ్వసించిన పురుషులతో, వారి చూపులను క్రిందికి పెట్టుకోమని ఇంకా వారి మర్మాంగాలను కాపాడుకోమని చెప్పు. ....... విశ్వసించిన స్త్రీలతో కూడా వారి చూపులను క్రిందికి పెట్టుకోమని ఇంకా వారి మర్మాంగాలను కాపాడుకోమని చెప్పు..... ఖుర్ఆన్ 24 : 30-31

కృతజ్ఞత : అల్లాహ్, మిమ్మల్ని మీ తల్లుల గర్భాలనుండి, పుట్టించాడు అప్పుడు మీకేమీ తెలియదు. ఇంకా మీకు వినికిడినీ, దృష్టినీ ఇంకా హృదయాలను ప్రసాదించాడు. బహుశా మీరు కృతజ్ఞులై ఉంటారని. ఖుర్ఆన్ 16 : 78

న్యాయం : ఓ విశ్వాసులారా! మీరు న్యాయం కొరకు స్థిరంగా నిలబడి, అల్లాహ్ కొరకే సాక్ష్యమివ్వండి. ఇంకా మీ సాక్ష్యం మీకుగానీ, మీ తల్లిదండ్రులకు గానీ, మీ బంధువులకుగానీ, విరుద్ధంగా ఉన్నాసరే. ఖుర్ఆన్ 4 : 135

సహనం: సహనం వహించు; నిశ్చయంగా, అల్లాహ్ సజ్జనుల ప్రతిఫలాన్ని వ్యర్థం చేయడు. ఖుర్ఆన్ 11 : 115

సదాచరణ: విశ్వసించి సత్కార్యాలు చేసే వారికి క్షమాపణ ఇంకా గొప్ప ప్రతిఫలం ఉన్నాయని అల్లాహ్ వాగ్దానం చేశాడు. ఖుర్ఆన్ 5 : 9

**ముగింపు** దివ్యఖుర్ఆన్ మనిషికి ఒకేఒక్క నిజమైన దేవుడిని ఎలా ఆరాధించాలో నేర్పుతుంది. ఆ విధంగా మనిషి తన నిజమైన జీవితలక్ష్యం సాధించుకునేలా చేస్తుంది. తద్వారా ఇహపరలోకాల్లో సాఫల్యం పొందేలా దారి చూపుతుంది.

మేము మానవులందరి కొరకు, ఈ గ్రంథాన్ని, సత్యంతో నీపై అవతరింపజేశాము. కావున సన్మార్గంపై నడచేవాడు, తన మేలు కొరకే అలాచేస్తాడు. నిశ్చయంగా, మార్గభ్రష్టుడైన వాడు తన కీడుకొరకే మార్గభ్రష్టుడవుతాడు. ఖుర్ఆన్ 39:41

ఈ గొప్ప గ్రంథాన్ని కనీసం చదవవలసిన బాధ్యత మనపై లేదా?

సంప్రదించండి

ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్

040 - 6832 7832 - Hyderabad

# మానవాళికి పంపబడిన చిట్టచివరి దైవగ్రంథం

# ఖుర్ఆన్



మౌలిక విషయాలు
తెలుసుకుందాం

040 - 6832 7832
Toll Free 1800 572 3000
www.discovertruepath.com
You Tube : DiscoverTruePath

# ఖుర్ఆన్ అంటే ?

## దైవవాక్కు

దివ్యఖుర్ఆన్ దేవుని వాక్కు. విశ్వప్రభువు (అరబీ భాషలో అల్లాహ్), దైవదూత జిబ్రయీల్ ద్వారా ప్రవక్త ముహమ్మద్(స) పై ఖుర్ఆన్ గ్రంథాన్ని అవతరింప జేశాడు.

> ఈ గ్రంథం (ఖుర్ఆన్) సర్వశక్తిమంతుడు, మహావివేకవంతుడైన అల్లాహ్ తరఫునుండి అవతరింపజేయబడింది. (39:1)

## మానవాళికి మార్గదర్శకం

> దివ్యఖుర్ఆన్ "మానవాళికి మార్గదర్శక గ్రంథం. గీటురాయి (మంచి చెడులు వేరుచేసి చూపేది)" ఖుర్ఆన్ 2 : 185

మానవాళి మంచి చెడులను తెలుసుకోడానికి కావలసిన మార్గదర్శనాన్ని ఖుర్ఆన్ అందిస్తుంది. ఈ మార్గదర్శనం లేకపోతే మనిషి తీవ్రమైన నష్టానికి గురవుతాడు.

## చిట్టచివరి దైవగ్రంథం

విశ్వప్రభువు అవతరింపజేసిన గ్రంథాల్లో దివ్యఖుర్ఆన్ చిట్టచివరి గ్రంథం. అంతకు మునుపు అవతరించిన దైవగ్రంథాల్లోని సత్యాన్ని ధృవీకరించడం, ఆయా గ్రంథాల్లో జరిగిన మార్పులు చేర్పులను నిరాకరించడం జరిగింది.

> ఓ గ్రంథప్రజలారా! మీ వద్ద ఉన్న గ్రంథాన్ని ధృవపరుస్తూ, మేము అవతరింపజేసిన దానిని విశ్వసించండి. (ఖుర్ఆన్ 4:47)

## ఖుర్ఆన్ ఎలా అవతరించింది?

ప్రవక్త ముహమ్మద్ (ఆయనకు శాంతి కలుగుగాక)పై దివ్యఖుర్ఆన్ అవతరించింది. ఏ భాషలో అవతరించిందో అదే అరబీ భాషలో నేటికి ఉంది. అయితే అనేక భాషల్లో ఖుర్ఆన్ అనువాదాలు అందుబాటులో ఉన్నాయి.

ఒకేసారిగా పుస్తక రూపంలో దివ్యఖుర్ఆన్ రాలేదు. 23 సంవత్సరాల సుదీర్ఘకాలంలో కొద్ది కొద్దిగా దైవవాక్యాలు అవతరించాయి. అందువల్ల ఎలాంటి పరిస్థితుల్లో ఏ వాక్యాలు అవతరించాయన్నది తెలుసుకోవడం చాలా అవసరం. ఆ విధంగా దివ్యఖుర్ఆన్‌ను సరిగా అర్థం చేసుకోగలము. లేకపోతే వాక్యాలను తప్పుగా అర్థం చేసుకునే ప్రమాదం ఉంది.

# ఇది దైవవాక్కు అని తెలుసుకోవడం ఎలా?

## సురక్షిత గ్రంథం

అవతరించిన కాలంలో ఎలా ఉందో ఎలాంటిదలాగే సుదీర్ఘకాలం ఎలాంటి మార్పులు చేర్పులు లేకుండా మిగిలిన ఏకైక ధార్మిక గ్రంథం దివ్యఖుర్ఆన్. 1400 సంవత్సరాలక్రితం అవతరించినప్పుడు ఎలా ఉందో అందులో చిన్న మార్పు కూడా ఆ తర్వాత జరగలేదు. ఖుర్ఆన్ రాత రూపంలో భద్రపరచడం మాత్రమే కాదు, చాలా మంది స్త్రీలు పురుషులు పిల్లలు కంఠస్తం చేసి తమ హృదయాల్లో భద్రపరచుకున్నారు. నేడు కోట్లాది మంది దివ్యఖుర్ఆన్ కంఠస్థం చేసినవారున్నారు.

> "ఈ ఖుర్ఆన్‌ను మేము అవతరింపజేశాము. స్వయంగా మేమే దానిని రక్షిస్తాము."
> (ఖుర్ఆన్ 15 : 09)

## వైజ్ఞానిక మహాత్యవిశేషాలు

దివ్యఖుర్ఆన్ ఆధునిక సైన్సును విభేదించదు. సైన్సును ఖుర్ఆన్ సమర్ధిస్తుంది. దివ్యఖుర్ఆన్‌కు సంబంధించి ఒక మహాత్యంలాంటి విశేషమేమంటే మానవాభివృద్ధి శాస్త్రం, ఎంబ్రియోలజీ, వాతావరణశాస్త్రం, ఖగోళశాస్త్రం, భూగోళశాస్త్రం, సముద్రశాస్త్రం తదితర శాస్త్రాలకు సంబంధించి అనేక అంశాలు చాలా నిక్కచ్చిగా ఖుర్ఆన్‌లో ప్రస్తావించబడ్డాయి. ఏడవ శతాబ్దానికి చెందిన పుస్తకంలో ఇంత ఖచ్చితంగా ఆధునిక వైజ్ఞానిక అంశాలు ఉండడం చూసి చాలా మంది శాస్త్రవేత్తలు ఆశ్చర్యపోయారు.

> "మేము త్వరలోనే వారికి మా సూచనలను వారిచుట్టూ ఉన్న ప్రపంచంలోనూ చూపిస్తాము, వారి లోనూ చూపిస్తాము. చివరకు ఈ ఖుర్ఆన్ నిస్సందేహంగా సత్యమైనదని వారికి విశదమైపోతుంది."
> ( ఖుర్ఆన్ 41 : 53)

నిజానికి దివ్యఖుర్ఆన్ ప్రస్తావించిన అనేక వైజ్ఞానిక అంశాలు ఆధునిక కాలంలోనే కనుగొనబడ్డాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలసహాయంతో వీటిని కనుగొనడం జరిగింది. ఉదాహరణకు:

- మానవ పిండం అభివృద్ధి గురించి దివ్యఖుర్ఆన్ వివరణాత్మక వర్ణన ఇస్తుంది. ఇటీవలి కాలం వరకు ఈ వివరాలు శాస్త్రవేత్తలకు తెలియవు.
- ఖగోళాలు (నక్షత్రాలు, గ్రహాలు, ఉపగ్రహాలు వగైరా) అన్నీ ధూళి మేఘాల నుంచి పుట్టాయి. ఈ వివరాలు ఇంతకు ముందు తెలియవు. నేడు ఆధునిక ఖగోళశాస్త్రంలో ఇవి నిర్ధారితమైన సత్యాలు.
- రెండు సముద్రాలనీరు కలిసినా దేనికదే ప్రత్యేకంగా సాంద్రతను, ఉష్ణోగ్రతను, లవణీయతను కలిగి ఉంటాయని, వాటి మధ్య ఒక అడ్డుతెర ఉంటుందని నేడు ఆధునిక విజ్ఞానశాస్త్రం అంగీకరిస్తుంది.

ఈ వైజ్ఞానిక విషయాలను, దేవుని చిహ్నాలను దివ్యఖుర్ఆన్ నేటికి 1400 సంవత్సరాల క్రితమే ప్రస్తావించింది.

## విశిష్టత

దివ్యఖుర్ఆన్ లాంటి శైలి, భాష, భవిష్యవాణి, సాహితీ సౌందర్యం ఉన్న రచన, కనీసం ఒక్క అధ్యాయం కూడా ఎవ్వరూ నేటి వరకు తయారు చేయలేకపోయారు. ఆ కాలంలోనే ఈ సవాలు చేయబడింది. ప్రవక్త ముహమ్మద్ (స)ను తిరస్కరించినవారు ఈ సవాలును ఎదుర్కోడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. అరబీ భాషలో అద్భుత ప్రావీణ్యం ఉన్న వారు కూడా ఓటమి ఒప్పుకున్నారు. నేటి వరకు ఆ సవాలు అలాగే ఉంది.

> "మేము మా దాసునిపై అవతరింపజేసిన గ్రంథం గురించి, అది మా గ్రంథం అవునో కాదో అని మీకు సందేహం ఉన్నట్లయితే దానివంటి ఒక్క సూరానైనా మీరు రచించి తీసుకురండి. మీ సహచరులందరినీ పిలుచుకోండి. ఒక్క అల్లాహ్ తప్ప మరెవరి సహాయాన్నైనా పొందండి. మీరు సత్యవంతులే అయితే ఈ పని చేసి చూపించండి." (ఖుర్ఆన్ 2 : 23)

## ఎలాంటి వైరుధ్యాలు లేని గ్రంథం

సాధారణంగా రచనల్లో తప్పులు దొర్లడం, స్పెల్లింగ్ పొరబాట్లు ఉండడం, వ్యాకరణ దోషాలు ఉండడం, వైరుధ్య వ్యాఖ్యలు చోటు చేసుకోవడం, వాస్తవాలవిషయంలో తప్పులు, సమాచారాన్ని సమగ్రంగా చెప్పలేకపోవడం వంటి లోపాలు ఉంటాయి.

> "ఇది అల్లాహ్ తరఫు నుండి కాక వేరొకరి తరఫు నుండి వచ్చి ఉన్నట్లయితే ఇందులో ఎన్నో పరస్పర విరుద్ధాలైన విషయాలుఉండేవి."
> (దివ్యఖుర్ఆన్ 4:82)

కాని, దివ్యఖుర్ఆన్‌లో వైరుధ్యాలనేవి లేనేలేవు. వాటర్ సైకిల్, ఎంబ్రియోలజీ, భూగోళశాస్త్రం, కాస్మాలజీ, చారిత్రక వాస్తవాలు, భవిష్యవాణులు ఏ విషయంలో అయినా సరే దివ్యఖుర్ఆన్‌లో ఎలాంటి వైరుధ్యాలు కనబడవు.

## ఇది ముహమ్మద్(స) రచన కాదు

ప్రవక్త ముహమ్మద్ (ఆయనకు శాంతి కలుగుగాక) అక్షరాస్యులు కాదు. ఆయన చదవలేరు, రాయలేరు. ఆయన ఏ రంగంలోను విద్యాజ్ఞానాలు అభ్యసించలేదు. వైజ్ఞానిక విషయాలను ఖచ్చితంగా వివరించడంగాని, సాహిత్య పరంగా అత్యున్నత విలువలు కలిగిన ఈ గ్రంథ రచన కాని ఆయన చేయడం సాధ్యం కాదు. అంతేకాదు, గత జాతులు, నాగరికతల చరిత్రను అంత ఖచ్చితంగా చెప్పడం ఏ మనిషికైనా సాధ్యం కాదు.

> "అల్లాహ్ పంపిన వహీ, ఆయన చేసిన బోధనలు లేకుండా రచింపబడే వస్తువుకాదు ఈ ఖుర్ఆన్"
> (ఖుర్ఆన్ 10:37)